వైభవంగా విజయదశమి వేడుకలు

రాయదుర్గం పట్టణంలోని ఏడో వార్డు వరలక్ష్మీవీధిలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహ నిమజ్జనం ఆదివారం వైభవంగా జరిగింది. ఆదివారం విగ్రహం నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. నేసేపేట నుంచి విగ్రహాన్ని బళ్లారి రోడ్డు వరకు ర్యాలీ చేసి, లక్ష్మీ నవ నారసింహస్వామి ఆలయం వద్ద నిమజ్జనం చేశారు.

భక్తిశ్రద్ధలతో రాజరాజేశ్వరీదేవి రథోత్సవం

బొమ్మక్కపల్లి గ్రామంలో వెలసిన రాజరాజేశ్వరీదేవి రథోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. విజయదశమిని పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ఊరేగించారు.

వైభవంగా బూదిగుమ్మ రథోత్సవం

బెళుగుప్ప: మండలంలోని బూదిగుమ్మలోని పద్మావతి వెంకటరమణస్వామి ఆలయంలో శ్రీవారి రథోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. పద్మావతి అమ్మవారిని దుర్గాదేవిగా, వెంకటేశ్వర స్వామిని ప్రత్యేక అలంకరణలో పూజలు చేశారు. అనంతరం స్వామి పల్లకీసేవతో ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి, రతోత్సవం నిర్వహించారు. ఎస్‌ఐ శివ ఆధ్వర్యంలో పోలీసు భద్రత ఏర్పాటు చేశారు.

రాజరాజేశ్వరీగా జగదీశ్వరీ అమ్మవారు

ఉరవకొండ: పట్టణంలోని శ్రీజగదీశ్వరి, ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయాల్లో అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో శనివారం దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జగదీశ్వరి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త గాజుల శ్యామలమ్మ ఆధ్వర్యంలో గవిమఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని ఉరవకొండలో ఊరేగించారు.

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో ప్రజలు విజయదశమి పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సాయంత్రం శత్రు వినాశనం కోసం జమ్మిచెట్టు ప్రదక్షిణ చేసి, ప్రత్యేక పూజలు చేశారు.


రాయదుర్గం బన్నీ మహంకాళి ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తులు


శమీవృక్ష దర్శనానికి ఊరేగింపుగా తరలివస్తున్న దృశ్యం

బోరంపల్లి గ్రామంలో గ్రామస్తులు పాండువుల వేషధారణలతో ఎడ్లబండిపై ఊరేగించడం ఆకట్టుకుంది. డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ , గోవింద వాడ, దర్గాహొన్నూరు, శ్రీధరఘట్ట, గోనేహాళ్, ఉప్పర హాళ్, నేమకల్లు, ఉంతకల్లు, బొమ్మనహాళ్ తదితర గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శనివారం సాయంత్రం జమ్మిచెట్టుకు పూజలు చేశారు. ఉద్దేహాళ్‌లో జమ్మిచెట్టు వద్ద యూత్ సభ్యులు ప్రసాద్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, వంశీ, వన్నూరుస్వామి, రాజ, రవి అన్నదానం చేశారు.

కంబదూరు: మండలంలో విజయదశమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో విజయదశమి సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంబదూరులోని పురాతన మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామిని ప్రతేకంగా అలంకరించి,పూజలు చేశారు.

కూడేరు: మండలంలోని జోడు లింగాల సంగమేశ్వర స్వామి, బసాపురం ఆంజనేయ స్వామి, కొర్రకోడు, కరుట్లపల్లి, ముద్దలాపురంలోని రామాలయం, గొల్లపల్లి సుంకులమ్మ, అంతరగంగ, కలగళ్లలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కూడేరులో నేసే కుల సంఘం ఆధ్వర్యంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి జమ్మిచెట్టు వరకు ఊరేగించి, అనంతరం పూజలు చేశారు.

కణేకల్లు: కణేకల్లులో దసర పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా కన్యకాపరమేశ్వరి ఆలయం, దుర్గాదేవీ ఆలయంతోపాటు చిక్కణ్ణేశ్వర స్వామి, సిద్దేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం సాయంకాలం చిక్కణ్ణేశ్వర స్వామి, సిద్దేశ్వరస్వామిలను పల్లకీ ఉత్సవాలు నిర్వహించారు. ఆలయాల నుంచి రామనగర్‌లోని శమీ చెట్టు వరకు పల్లకోత్సవాలు జరిగాయి.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా విజయ దశమి పండుగ భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆంజనేయ, ఈశ్వర స్వాముల ఉత్సవ విగ్రహాలను అడ్డపల్లకీలో శమీ వృక్షం వరకు ఊరేగించారు. అనంతరం శమీ వృక్షాల వద్దకు చేరుకొని పూజలు నిర్వహించారు.

కూడేరు: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరా (విజయ దశమి) పండుగని కూడేరులో ఉన్న బహ్మకుమారీ విశ్వ విద్యాలయం మండల సంచాలకురాలు వేదవతి తెలిపారు. శనివారం ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇప్పేరు, కూడేరు గ్రామాల్లో దసరా పండుగను జరుపుకున్నారు.

శమీవృక్ష దర్శనానికి పోటెత్తిన భక్తులు

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలో విజయదశమి వేడుకలను శనివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. బళ్లారి రోడ్డులోని పెద్ద బన్నీ మహంకాళి, ఓబుళాచారి రోడ్డులోని దుర్గామాతలకు (బన్నీ మహంకాళి ఆలయాల్లో) పూజలు చేశారు. శాంతినగర్‌లోని అమ్మవారి ఆలయానికి పట్టణ ప్రజలు శమీ దర్శనానికి పోటెత్తారు. వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన దేవతమూర్తుల విగ్రహాలను శాంతినగర్‌లోని దుర్గామాత (బన్నీ మహంకాళి) ఆలయం వద్ద శమీ వృక్షం చుట్టూ తిప్పి ఊరేగింపు జరిపారు. ఆలయం ముందు ప్రత్యేకంగా పల్లకీసేవ ఏర్పాటు చేసి, పూజలు చేశారు. వేడుకలకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొని ఉపేంద్రరెడ్డి, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.


కూడేరు: ఇప్పేరులో మహిషాసురడనే రాక్షసున్ని వధిస్తున్న దుర్గాదేవి


రాజరాజేశ్వరిగా జగదీశ్వరి అమ్మవారు


రాజరాజేశ్వరిగా ఉరగాద్రి చౌడేశ్వరి అమ్మవారు


బెళుగుప్పలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటరమణుడు


కంబదూరులో ప్రత్యేక అలంకరణ


గుమ్మఘట్టలో భద్రకాళి అమ్మవారు


బూదిగుమ్మ పద్మావతి వెంకటేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు


నేసే కుల సంఘం ఆధ్వర్యంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం


కూడేరు: ఈశ్వరీయ విద్యాలయంలో దసరా వేడుకలను జరుపుకుంటున్న బ్రహ్మకుమారీలు


జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు


బొమ్మక్కపల్లిలో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

ఘనంగా పాస్టర్స్ డే


జేసీఎం చర్చిలో పాస్టర్ సాల్మాన్ హంపన్నను సన్మానిస్తున్న సభ్యులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలోని జీసస్ కాలింగ్ మినిస్ట్రీస్ (జేసీఎం)లో ఆదివారం పాస్టర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. పాస్టర్ శామ్యూల్ రవి (బళ్లారి) పాస్టర్ డే విశిష్టతను తెలియజేశారు. అనంతరం జేసీఎం పాస్టర్ సాల్మాన్ హంపన్నను అతిథులతో పాటు సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. పాస్టర్ డేవిడ్, జైరామ్, దావీదు, రాజా, జాకోబ్, ముంజన్న, ఆశీర్వాదమ్మ పాల్గొన్నారు.

శుభకార్యం


కూడేరు: నూతన వధూవరులతో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ ప్రణయ్ రెడ్డి

కూడేరు: మండల పరిధిలోని మరుట్ల–2వ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ నేత ఏకిల రాము కుమారుడు యశ్వంత్ నాయుడు వివాహం శిరీషాతో ఆదివారం ఆయన స్వగృహంలో జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్ కుమార్ రెడ్డి హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీపీ నారాయణ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, నాయకులు నాగరాజు, బండారు వెంకటేష్, బండారు శ్రీనివాసులు, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో హైలెవల్ బ్రిడ్జి పూర్తి


హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

కణేకల్లు: రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని హైలెవల్ బ్రిడ్జి పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. కణేకల్లు శివారులో హెచ్చెల్సీ అక్విడెక్ట్ దిగు వేదవతి హగిరిపై రూ.48.42 కోట్లతో నిర్మించతలపెట్టిన హైలెవల్ బ్రిడ్జి పనులకు ఎమ్మెల్యే కాలవ శనివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి, ఎంపీపీ లీలావతి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఓబుళరెడ్డి, ఈఈ ప్రసాద్‌రెడ్డి, డీఈఈ రవిశంకర్‌రెడ్డి, జేఈలు నాగేంద్రప్రసాద్, చంద్రశేఖర్, కాంట్రాక్టర్ రామసుబ్బారెడ్డి, మాజీ వైస్ సర్పంచు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

వజ్రకరూరు: మండలంలోని కమలపాడు బస్టాప్ పరిసర ప్రాంతంలో ఆదివారం రాత్రి ద్వి చక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన వేములనాయుడు, అతని ఇద్దరు కుమారులు ద్విచక్ర వాహనంపై గుంతకల్లు నుంచి వజ్రకరూరుకు వెళ్తున్నారు. కమలపాడు బస్టాప్ వద్ద వెనుక వైపు నుంచి కారు ఢీకొట్టడంతో వేములనాయుడు, ఇద్దరు కుమారులకు గాయాలయ్యాయి. వీరిని ప్రైవేట్ వాహనంలో గుంతకల్లు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహిద్దాం


వాల్మీకి జయంతిపై చర్చిస్తున్న నాయకులు

రాయదుర్గం: వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని వాల్మీకి సంక్షేమ సేవా సమితి నియోజకవర్గ అధ్యక్షుడు బండి క్రిష్టప్ప పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని మారెమ్మగుడి సమీపానున్న వాల్మీకి నూతన కళ్యాణ మంటపంలో సమావేశం నిర్వహించారు. తాలూకా సేవాసమితి కార్యదర్శి ఎన్‌టీ సిద్దప్ప, ఉపాధ్యక్షులు మలకన్న, పైతోట రఘు, ప్రధాన సలహాదారు తలారి రాజప్ప, సభ్యులు అడ్వొకేట్ మురళి, పైతోట ముత్తప్ప, తిప్పేస్వామి, శ్రీనివాసులుతో కలసి ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం బండి కిష్టప్ప మాట్లాడారు. నవంబర్ మొదటి వారంలో నూతనంగా నిర్మించబడే కళ్యాణ మంటపాన్ని ప్రారంభించేలా తీర్మానించారు. ఈ నెల 17న వాల్మీకి జయంతి వేడుకల్లో భాగంగా మహర్షి చిత్రపటానికి పూలమాలు వేసి, బైక్ ర్యాలీ నిర్వహిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా సలహాదారు మల్లయ్య, ప్రకాష్, రాయుడు, రఘు, సిద్దలింగప్ప, రాముడు, చంద్ర, సిద్దప్ప, దేవేంద్ర పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మారేష్‌కు ఆర్థిక సాయం

ఉరవకొండ: పట్టణానికి చెందిన గందోడి మారేష్‌కు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంపిన చెక్కును పార్టీ నేతలు ఆదివారం అందించారు. నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు రాకెట్ల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి సోదరుడు వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి చేతుల మిదుగా రూ.50వేల చెక్కును బాధితుడు గందోడి మారేష్‌కు అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత నియోజకవర్గంలో టీడీపీ గుండాలు విచ్చలవిడిగా దాడులకు తెగబడి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని రచిస్తున్నారని తెలిపారు. సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్, పార్టీ నాయకులు నాగరాజు, మాజీ ఎంపీటీసీ శీనా, ఉపసర్పంచ్ రామిరెడ్డి, బాబు, హరిరెడ్డిలు పాల్గొన్నారు.


మారేష్‌కు చెక్కు అందిస్తున్న వైస్ ఎంపీపీ, నాయకులు

వైస్ ఎంపీపీ భర్త అక్కజ్జప్ప మృతి

గుమ్మఘట్ట: మండలంలోని సిరిగెదొడ్డి గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ సిరిగె జయమ్మ భర్త అక్కజ్జప్ప (58) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అక్కజ్జప్ప మృతి పార్టీకి తీరని లోటని మెట్టు గోవిందరెడ్డి అన్నారు. పార్టీ అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించేవాడన్నారు. మండల కన్వీనర్ గొని లక్ష్మీకాంతారెడ్డి, ఎంపీపీ భవాని, సర్పంచ్‌లు రమేష్,రాజేష్, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచులు కిందింటి పాలయ్య, గాదిరి పాలయ్య, కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి , చెరువుదొడ్డి రామన్న పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలోని ఆర్‌ఎంపీ వైద్యుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని హటకేశ్వరస్వామి ఆలయ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన నియోజకవర్గంలోని ఆర్‌ఎంపీల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీల యూనియన్ నాయకులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మండలం పాలవాయిలో జీపీ అనిల్ అనే రైతు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి ధ్వంసం చేశారు.



ఆర్డీఓ ఆసుపత్రి ఎదురుగా రూరల్ స్టేషన్‌కు వెళ్లే దారిలో ఇలా..



టీ సర్కిల్ వద్ద విద్యుత్ స్తంభంపైన, చెట్టు మధ్యలో సీసీ కెమెరాలు

నిఘానేత్రాలకు అల్లుకున్న తీగలు

కళ్యాణదుర్గంలో నిఘా నేత్రాలు (సీసీ కెమెరాలు)కు తీగలు అడ్డుపడ్డాయి. పట్టణంలో ఉన్న సీసీ కెమెరాలన్నింటికీ తీగలు అడ్డుగా కప్పకున్నాయి. స్థానిక ఆర్డీఓ ఆసుపత్రి ఎదురుగా రూరల్ పోలీసు స్టేషన్‌కు వెళ్లే దారిలో తీగల్లో సీసీ కెమెరా కనిపించడంలేదు. డీఎస్పీ కార్యాలయం ఎదురుగా రాయదుర్గం ప్రధాన రహదారిపై ఇరువైపులా ఉన్న నిఘా నేత్రాలకు కూడా తీగలు చుట్టుకప్పకున్నాయి. టీ సర్కిల్ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరా నేలను చూస్తోంది. ఇటీవల ద్విచక్ర వాహనాల చోరీలు, ఇళ్లల్లో దొంగతనాలు అధికంగా జరుగుతున్నాయని స్థానిక ప్రజలు అంటున్నారు.

– కళ్యాణదుర్గం:


డీఎస్పీ కార్యాలయం ఎదురుగా నేలచూపులు చూస్తున్న నిఘా నేత్రాలు

మద్యంషాపులకు దేవతల పేర్లు పెట్టొద్దు

రాయదుర్గంటౌన్: కొత్త మద్యం పాలసీలో భాగంగా షాపుల కేటాయింపు తర్వాత ప్రారంభించే మద్యం షాపులకు హిందూ మనోభావాలు దెబ్బతినేలా దేవి, దేవతల పేర్లు పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వీహెచ్‌పీ విన్నవించింది. ఈ మేరకు వీహెచ్‌పీ పట్టణ శాఖ అధ్యక్షుడు రాజేష్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి మల్లికార్జున మాట్లాడారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

బొమ్మనహాళ్: ఉంతకల్లు గ్రామ సమీపంలోని తోటలో ఆదివారం పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. వారి నుంచి రూ.10,850 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని రాయదుర్గం కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతులకు దేశీఆవుల పంపిణీ

కుందుర్పి: సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా కుసుమగిరి రైతు ఉత్పత్తి దారుల కంపెనీ ఆధ్వర్యంలో చిన్నసన్నకారు రైతులకు దేశీ ఆవులను ఇస్తున్నట్లు సంస్థ సీఈఓ నరశింహమూర్తి, డైరెక్టర్ లక్ష్మీపతి తదితరులు సూచించారు.ఆదివారం కుందుర్పి,మలయనూరు తదితర పంచాయతీల్లో దేశీయ అవులను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు.

డ్రైనేజీలో ఇరుక్కున్న లారీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటవాకిలి వద్ద డ్రైనేజీలో ఓ భారీ లారీ చక్రాలు ఇరుకుపోయాయి. అయితే అదృష్టవశాత్తూ ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయ ప్రహరీ నిర్మాణానికి కుప్పం నుంచి తెల్ల గ్రానైట్ రాయిని తరలిస్తున్న క్రమంలో లారీ కోటవాకిలి వద్ద మలుపు వద్ద లారీ ఇరుక్కుపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో అటువైపుగా ప్రజలు ఎవరు లేరు. క్రేన్ సాయంతో లారీని తొలగించారు.

ల(కి)క్కు ఎవరిదో..?

- దరఖాస్తు దశలోనే అధికార పార్టీ ఒత్తిళ్లు
- టెండర్లన్నీ సిండికేట్లవే
- సరిహద్దు ప్రాంతాల్లో మోత మోగిన దరఖాస్తులు
- రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ లో 943 మంది పోటీ
- నేడు జేఎన్‌టీయూలో లాటరీ

గతంలో మద్యం టెండర్లలో లక్కు ఉన్నోడిదే 'కిక్కు' అనేలా ఉండేది.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 'తిక్కోడి విందులో తాగినోడికి తాగినంత మందు ' చందంగా మారింది. అధికార బలమున్నోడికే అన్నీ వరిస్తాయన్నదానికి నిదర్శనం ప్రస్తుతం మద్యం టెండర్ల ప్రక్రియలో తేటతెల్లమవుతోంది. నోటిఫికేషన్ విడుదలయినప్పటి నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదట్ల కొంత మందకొడిగా సాగింది. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత వారం రోజులు కొన్ని షాపులకు సింగిల్ దరఖాస్తు నమోదయ్యింది. గడువు దగ్గరపడేకొద్దీ.. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి షాపులన్నీ సొంతం చేసుకునేలా పలువురు అధికార పార్టీ నేతల పైరవీలు, సిండికేట్ల మాయాజాలం, దౌర్జన్యాలు, బెదిరింపుల పర్వం ఆసాంతం గ'మ్మత్తు'గా సాగింది. దరఖాస్తు ప్రక్రియ గందరగోళంగా సాగుతుండడంతో విమర్శలకు తావిచ్చింది. దీంతో ప్రభుత్వ పెద్దలు జోక్యంతో సజావుగా సాగింది. సోమవారం జిల్లా కేంద్రంలో మద్యం టెండర్ల లాటరీ తీయనున్నారు.

– రాయదుర్గం :



జిల్లాలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవరాల్లోని 37 మద్యం దుకాణాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో అత్యధికంగా సరిహద్దు మండలాల్లోనే పోటీ ఏర్పడింది. రాయదుర్గం అర్బన్‌లో 05 షాపులకు 146, ఉరవకొండలో 05 షాపులకు 157 అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయి. 37 షాపులకు 943 దరఖాస్తులు రావడం విశేషం. షాపులు దక్కించుకునేందుకు వ్యాపారుల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు చెల్లించి, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు.

నేడు జేఎన్‌టీయూలో లాటరీ..

లక్కీడిప్‌లో లక్కు ఎవరికి దక్కనుందో..సోమవారం తేలిపోనుంది. ఇందుకు అనంతపురం జేఎన్‌టీయూ వేదిక కానుంది. దరఖాస్తుదారుల ఎంట్రీ పాస్‌తో పాటు ఓటరు గుర్తింపు కార్డు/ డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్టు/ బ్యాంకు పాసుపుస్తకం / ఆధార్/ ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఉంటేనే అనుమతిస్తారు. 16 నుంచి కొత్త మద్యం దుకాణాలు తెరుచుకోనున్నాయి. ఈ అదృష్టం ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి. ఇదిలా ఉండగా షాపులన్నీ అధికారపార్టీ నేతల కనుసన్నల్లో జరిగేలా కొందరు చక్రం తిప్పుతున్నారు. లాటరీ తగిలినా తమకే ఇచ్చేయాలనే ఒత్తిళ్లు అప్పుడే మొదలయ్యాయి. అడ్డుకున్నా కొందరు తమ మాట లెక్క చేయకుండా దరఖాస్తు చేశారని, మా మద్దతు లేకుండా షాపులు నిర్వహించడం సులభం కాదనే విషయం తెలుసుకోవాలని హెచ్చరికలు జారీ చేస్తున్నట్టు చర్చ జరిగింది. ఏదిఏమైనా వ్యాపారుల్లో నెలకొన్న ఉత్కంఠకు సోమవారంతో తెరపడనుంది. ఇలాంటి బెదిరింపుల పర్వం మునుపెన్నడూ చూడలేదని వ్యాపారులు విమర్శలు చేస్తున్నారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండలో దరఖాస్తు దారుల వివరాలిలా..

మండలం	మద్యం షాపులు	వచ్చిన దరఖాస్తులు
రాయదుర్గం అర్బన్	05	146
రూరల్	01	18
డి హీరేహాళ్	01	46
గుమ్మఘట్ట	01	26
కణేకల్లు	04	66
బొమ్మనహాళ్	02	80
కళ్యాణదుర్గం	03	21
రూరల్	02	21
బ్రహ్మసముద్రం	01	18
కంబదూరు	01	17
కుందుర్పి	02	22
శెట్టూరు	01	11
ఉరవకొండ	05	157
కూడేరు	03	63
బెళుగుప్ప	01	39
వజ్రకరూరు	02	55
విడపనకల్లు	02	99
మొత్తం	37	943

పదిమందిపై కేసు నమోదు

వజ్రకరూరు: కొనకొండ్ల గ్రామంలో ఇరువర్గాలకు చెందిన 10 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. గట్టిగా కేకలు వేస్తూ గొడవ పడడంతో పబ్లిక్ న్యూసెన్స్ కింద ఇరువర్గాలకు చెందిన పది మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.